ఏకాగ్రంగా చేపట్టలేకపోతున్నాడని, అతన్ని తన ఇంట్లో ఎక్కువ సేపు వుంచేటందుకు వీలుగా అతన్ని తన దేహంతో ఆకర్షించింది. "గృహమే కదా, స్వర్గసీమ" అని నమ్మిన ఆయన, తాను వ్రాస్తున్న ఋష్యశృంగ నృత్య నాటికను గురించి భార్యకి బోధపరుస్తూ - "సృష్టి మొదలు ఇప్పటివరకు ఆడదాని ఆకర్షణలో పడని మొగవాడే లేడు" అని వివరిస్తే, "మీ పుణ్యం! మీరు మాత్రం పడకండీ!" అని ఆవిడ జోక్ చేసింది. కాని అతను సుజాత వలలో ఎంతగా ఇరుక్కుపోయాడంటే, తను రాసిన నృత్య నాటికల్లో నాయక పాత్ర తానే ధరించడానికి సిద్ధమై, ప్రదర్శనల నిమిత్తం ఉద్యోగాన్ని, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేసి ఆమెతో రాష్ట్రం అంతా సంచారం చేసి "నీకూ నీ వారు లేరు, నాకూ నా వారు లేరు" అని పాడేడు. జీవితంలో వెరైటీ కోరే వ్యక్తులు, నాటకాల్లో వెరైటీ కోరే ప్రేక్షకులూ ఎప్పుడూ వుంటారే కదా! ఆ విధంగా మన హీరో సుజాత తృణీకారానికి గురై ఇంటిదారిపట్టి "గృహమే కదా, స్వర్గసీమ" అనే పాత సూత్రానికి మళ్లీ ప్రాణం పోసేడు.

ఒక మగవాడు — భార్యా, బిడ్డలు ... అతను తాత్కాలికంగా వేరే స్త్రీ ఆకర్షణలో పడడం ... కొన్నాళ్లకి జ్ఞానోదయం ... తిరిగి ఇల్లు చేరి భార్యా, బిడ్డల్ని శ్రద్ధగా "ఏలుకోడం" — ఈ ఇతివృత్తం భారత దేశపు సెంటిమెంట్‌కి బాగా నప్పుతుంది. కనక (ఆ రోజుల్లో జనం ఇంకా సత్యకాలపు వాళ్లు కనక) ఇదే ఇతివృత్తంతో అరడజను సినిమాలు వచ్చేయి.

వస్తే వచ్చాయిగాక — ఎక్కడా "అతి" అనేది లేకుండా ఆద్యంతం ఎంటర్‌టెయిన్‌మెంట్ కలిగిస్తూ ఉన్నత ప్రమాణాలను అనుసరించి నిర్మితమైన చిత్రం "స్వర్గసీమ."

స్వర్గసీమ సినిమాలో "సుబ్బి" అనే వీథి భాగవత కళాకారిణి జీవితం పరిణామ సిద్ధాంతానికి ప్రతీక. "మా గుంపులో కల్లా నానే సదువుకున్న దాన్ని" అని స్పష్టంగా చెప్పిన సుబ్బి, "మంచి దినము నేడే! మహా రాజుగా రమ్మనవే!" అని తన ఏలికకు ఆహ్వానం పంపి, "హాయి సఖీ!" అనిపించి, "చాలులే పోరా! మాయల మారీ! ఈ దారి, నీ జాడ కనగోరి! వెదకి వేసారి, బేజారైతిరా" అనే స్థాయికి చేరింది.

"స్వర్గసీమ" సినిమా ఆద్యంతం పాటల మయం. ఆ పాటల బాణీలు అసలు సిసలు తెలుగు బాణీలు. చాలా కాలంగా బెంగాలీ మరాటీ మట్ల అనుకరణలతో స్వేచ్ఛానుసరణలతో నలిగిన తెలుగు సినిమా పాట స్వర్గసీమ సినిమాతో చాలా మార్పు తెచ్చుకుంది.

విశేషించి, ఘంటసాల వెంకటేశ్వరరావుకి మొదటి సారిగా సినిమా పాట పాడే అవకాశాన్ని (అందులోనూ అన్నప్రాశన నాడే ఆవకాయ అన్నట్టు సరాసరి భానుమతితో డ్యూయెట్టుతో) కలిగించిన సినిమా ఇది.

ఎన్నో పాత సినిమాల పేర్లు మళ్లీ మళ్లీ కొత్త సినిమాలకి పెట్టుకుంటున్నారు. (అహో, ఏమి ఈ శీర్షికా దారిద్ర్యము!) ఐతే, "స్వర్గసీమ" అని మరో సినిమా ఒచ్చినట్టు లేదు.

అలా అలా రకరకాల కారణాల వల్ల "స్వర్గసీమ" సినిమా నాకెంతో ఎంతో ఇష్టం.

# ఇదేం సంప్రదాయం

"సునీ! కళ్ళు తెరు. మన పాపాయి చూడు ఎంత ముద్దుగా వుందో! ఓయ్ నిన్నే! చూడు మరి కళ్ళు తెరిచి" అంటూ భార్య మీదకి వంగి ఆనంద్ ఆత్రంగా పిలుస్తున్నాడు.



అదో రకం కొత్తదనం, నిండుదనం అలసిన ఆమె ముఖంలో అందాల్ని సంతరించిపెట్టాయి. తన్మయంగా ఒక్క క్షణం చూసి కళ్ళు మరల్చుకుని ఉయ్యాలలోని పాపాయిని చూశాడు. తన ఆనందాన్ని ఎవరితో పంచుకోవాలో అర్థం కావడం లేదు ఆనంద్‌కి.

ఒంటరిగా, నిశ్శబ్దంగా తిరుగుతున్న సీలింగ్ ఫ్యాన్ క్రింద కూర్చుని చెరో ప్రక్కన వున్న భార్యని, కూతురిని మార్చి మార్చి చూస్తున్నాడు. నెమ్మదిగా కదలి కళ్ళు తెరచిన సునీతని చూసి మంచానికి మరింత సమీపంగా స్టూలు లాక్కున్నాడు. "సునీ! చూడు. మనిద్దరం కోరుకున్నట్టుగానే ఎంత చక్కటి పాపాయిని కన్నావో" అపురూపంగా భార్య కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు. సునీత సిగ్గుగా నవ్వింది. కళ్ళెత్తి పాపవైపు గర్వంగా చూసుకుంది అంతలోనే.

* * *

"సునీతా! పాప అచ్చు నీలాగే పొడవుగా, నాజూగ్గా, అందంగా వుంది" అంటూ ప్రశంసావర్షం కురిపించారు స్నేహితురాళ్ళంతా. ఆ క్షణంలో మళ్ళీ గర్వపడింది తన చిన్నారిని చూసుకుని.

రోజులు, నెలలు క్షణాల్లా పరుగులెత్తి పాప అప్పుడే ఎనిమిదేళ్ళ వయసుదైంది. ఆ రోజు స్కూల్ బస్ దిగి ఫ్రెండ్స్‌తో వీథి చివరనుంచి ముక్కల్లో చందమామలా ఆరోగ్యంగా, అందంగా, పుష్టిగా నడచి వస్తున్న పాపని చూసి మరోసారి ఆనందంతో మురిసింది సునీత.

* * *

సునీతకి పాప ఒక్కతే సంతానం కావడంతో ఆమె దృష్టంతా పాపమీదే. ఆలోచనలన్నీ పాప చుట్టూనే. ఆ రోజు ఆడుకుందుకు ఎదురింటికెళ్ళిన పాపని పదహారేళ్ళ సుధాకర్ ముద్దుచేసి ఆడిస్తూంటే ఎందుకో మనసు కలుక్కుమంది. అప్పటునుంచి ఆమె తల్లి మనసులో పాప విషయంలో చాలా భయం పట్టుకుంది.

సరిగ్గా ఇరవై ఏళ్ళ క్రితం తనూ ఇలాగే ఇదే వయసులో. ఇంట్లో అమ్మ, నానమ్మ తనని ఒక్క క్షణం స్వేచ్ఛగా ఆటలకు పెళ్ళనిచ్చేవారు కాదు. ఎక్కడికైనా వాళ్ళతో కలిసివెళ్ళి రావాల్సిందే కాని ఒక్కర్తెనూ వదిలేవారే కాదు.

"సునీ! పరికిణీ సరిగా కట్టుకో" అనో,

"ఆ గౌను క్రిందకి లాక్కో" అనో హెచ్చరింపులు.

ఓ పెట్టీకోట్‌తో వరండాలో కూర్చుని ఆడుకోబోతే-

"సిగ్గు లేకుండా ఏమిటా తిరగడం, పద లోపలికి, గౌను వేస్తాను" అని మందలింపు. ఎన్ని ఆంక్షలు!

నిండా పదేళ్ళు లేకపోయినా స్నానం చేసి టవల్‌తో బయటకు వస్తే కళ్ళెర్రచేసే అమ్మ రూపం తనకింకా గుర్తు. తెల్లవారితే ఎన్నెన్ని మందలింపులు! తనకి ఎంతో కష్టంగా వుండేది కాని... అమ్మని కాదనే ధైర్యం వున్నా, నానమ్మ దగ్గర భయం... ఛ... తనెప్పుడు పెద్దదైపోయి ఈ ఆంక్షల్నించి తప్పించుకుంటుందా అనుకునేది.

కాని ఆ తర్వాత మరో నాలుగేళ్ళకి ఇంకా హద్దులు చెప్పారు. ఆ తర్వాత ఇంకా, ఇంకా అలా చెబుతూనే వున్నారు. కాని ఆనంద్ చేతి నందుకున్న క్షణం నుంచి తనకెంత స్వేచ్ఛ! ఎంత సంతృప్తిగా, ధైర్యంగా నవ్వారు అమ్మ, నానమ్మ తనను అత్తవారింటికి పంపుతూ.

ఆనాడు తను అనుకుంది- ఛ... ఆడపిల్ల అంటే అదో దాచిపెట్టాల్సిన తాయిలంలా ఎంతెంత జాగ్రత్తలు! తను తన పాపని మాత్రం అలా పెంచదు ఎప్పటికీ అని ఆ క్షణానే అనుకుంది.

కాని... కాని... తన ఎదుట చిట్టి పాపాయి తన చేతులమధ్య తన పోషణలో పెరిగిన చిన్నారి తనంత ఎదుగుతుంటే ఎవరెవరి దృష్టి పడుతుందో అన్న భయం. అంత త్వరగా అలా ఎదిగిపోకపోతేనేం అని అంతగా ప్రేమించే చిట్టితల్లి మీద విసుగు, కోపం ఏమిటి? ఏమిటీ మానసిక స్థితి? ఎప్పటికీ ఆడపిల్ల అంటే ఓ గాజుబొమ్మలా, ప్రత్యేక రక్షణతో జాగ్రత్తపరచుకోవలసిన ప్రాణేనా?

పరిష్కారం తోచని సునీత కళ్ళల్లో నీళ్ళు!

—నాదెళ్ళ అనూరాధ